

బీజేపీ నేతలను బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

బీఆర్ఎస్‌లో చేరికలు

గాజులరామారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. సూరారం డివిజన్ టీఎస్ఐఐసీ కాలనీలో బీజేపీ సీనియర్ నాయకులు, కాలనీ మాజీ అధ్యక్షుడు నేతి రాజు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం, అభివృద్దే ముఖ్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేసిందని, పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో హామీలకు మించి అభివృద్ధి చేసి చూపించామన్నారు. కార్యక్రమంలో సూరారం కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు పుప్పాల భాస్కర్, ప్రధాన కార్యదర్శి సిద్దిక్, నాయకులు సురేష్‌బాబు, సాయిబాబా, రోషన్, రెహ్మాన్, సాంబశివరావు, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

నిజాంపేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నిజాంపేట్ జిల్లా కమిటీ మాజీ జాయింట్ సెక్రటరీ గుండు దుర్గాప్రసాద్, ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు బచ్చలకూరి వీరయ్య, సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇందిరమ్మకాలనీ ఫేజ్-1లో వరసిద్దివినాయక, రజకసంఘం సభ్యులు ఆదివారం ఆ పార్టీలో చేరారు. వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి గెలుపు కోసం కలిసికట్టుగా పని చెయ్యాలని శ్రీనివాస్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో గురుమూర్తి, అప్పారావు, శ్రీనివాసులు, అడ్డాల అప్పారావు, వెంకన్న, అడవి వెంకన్న, సూరిబాబు, సురేష్ పాల్గొన్నారు.

ఏఐఏవైఎస్ డివిజన్ అధ్యక్షుడిగా ప్రభాకర్

హైదర్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం (ఏఐఏవైఎస్) ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు వినయ్‌కుమార్ ఆదివారం నియామకపత్రం అందజేశారు. లక్డీకపూల్‌లోని రాష్ట్ర కార్యాలయంలో మహనీయుల జయంతి ఉత్సవాల సభలో ప్రభాకర్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. కార్యక్రమంలో గ్రేటర్ అధ్యక్షుడు కర్క నాగరాజు, ఉపాధ్యక్షుడు దినేష్‌కుమార్, అరుణ్‌కుమార్, జాకోబ్, వినయ్‌కుమార్, ప్రీతం, శ్రీకాంత్, జక్కుల అశోక్, అప్పలరాజు పాల్గొన్నారు.



నియామకపత్రం అందుకుంటున్న ప్రభాకర్

గాజులరామారం కాంగ్రెస్ కో-ఆర్డినేటర్‌గా నర్సింగరావు

గాజులరామారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్‌గా శరగడం నర్సింగరావు నియమితులయ్యారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడు శింగిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మైనంపల్లి హన్మంతరావు, కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, కూన శ్రీశైలంగౌడ్, నర్సారెడ్డి భూపతిరెడ్డిల ఆధ్వర్యంలో నియామకపత్రాన్ని నర్సింగరావుకు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సునీతామహేందర్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తానని తెలిపారు.



నర్సింగరావు

సీఎం సలహాదారును కలిసిన కార్పొరేటర్

హైదర్‌నగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డిని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ మర్యాదపూర్వకంగా ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారిని కార్పొరేటర్ సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, పోశెట్టిగౌడ్, నగేష్ పాల్గొన్నారు.



నరేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డిని సన్మానిస్తున్న వెంకటేష్‌గౌడ్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మియాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): అతివేగంతో వచ్చిన కారు ఢీ కొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లి ఎల్లమ్మబండ ప్రాంతానికి చెందిన రమేష్‌కామ్లే(53) దినసరి కార్మికుడు. ఆదివారం మియాపూర్ మెట్రోస్టేషన్ కల్వరి టెంపుల్ వద్ద రోడ్డు దాటుతుండగా అతడిని సుంకర సురేష్ అనే వ్యక్తి వేగంగా కారు నడుపుతూ ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రమేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



హత్యకు గురైన సుజాత



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌రావు, ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్

మహిళపై అత్యాచారం.. ఆపై హత్య

కూకట్‌పల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు ఓ మహిళపై అత్యాచారం చేసి ఆపై హత్య చేశారు. ఈ సంఘటన కూకట్‌పల్లిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట వాసి సుజాత(42) దినసరి కూలీ. ఈమె రాత్రి వేళల్లో మద్యం తాగి రోడ్లపై తిరుగుతుంటుంది. ఇదిలా ఉంటే ఆదివారం తెల్లవారుజామున కూకట్‌పల్లి వైజంక్షన్ వద్ద ఉన్న సుజాతపై గుర్తు తెలియని వ్యక్తులు అత్యాచారం చేసి హత్య చేశారు. మహిళ మృతదేహం గురించిన సమాచారం అందుకొన్న కూకట్‌పల్లి పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. మృతురాలి ఒంటిపై దుస్తులు లేకపోవడం, శరీరంపై గాయాలున్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నారు. మృతురాలు మూసాపేటకు చెందిన సుజాతగా గుర్తించారు. సీసీటీవీ ఫుటేజ్‌లు పరిశీలించిన పోలీసులు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు సుజాతను బలవంతంగా భవనం సెల్లార్‌లోకి తీసుకెళ్లడం గుర్తించారు. సీసీ ఫుటేజీ ఆదారంగా నిందితులను గుర్తించడం, ఆధారాలను సేకరించడంలో పోలీసులు నిమగ్నమయ్యారు. హత్యాచారం చేసిన నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామని ఏసీపీ తెలిపారు.

భవనంపై నుంచి కిందపడి వ్యక్తి మృతి

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): భవనంపైన పనిచేస్తూ అదుపు తప్పి కిందపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లాకు చెందిన దిల్లేశ్వర్ అలియాస్ కాళిదాసు రహ్మత్‌నగర్‌లో నివాసం ఉంటూ కూలి పని చేసేవాడు. ఇతడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఆదివారం ఉదయం సంజయ్‌నగర్ బీస్తీలోని రాజస్థాన్ ప్రాంతానికి చెందిన రాజబాబు ఇంటివద్ద పని ఉండటంతో ఉదయమే పనికి వెళ్లాడు. ఆ భవనం నాల్గొవ అంతస్తులో పని చేస్తుండగా ఉదయం 8.30 గంటల ప్రాంతంలో అదుపుతప్పి పైనుంచి కిందపడ్డాడు. మధ్యలో ఉన్న విద్యుత్ తీగలపై పడి రోడ్డు మీద పడటంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి: రంజిత్‌రెడ్డి

వివేకానందనగర్‌కాలనీ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే దేశం సంక్షేమం, అభివృద్ధి బాటలో పయనిస్తుందని ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలతో పాటు ఇతర సంక్షేమ పథకాలతో పేదరిక నిర్మూలన జరుగుతోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు రాష్ట్రం నుంచి మెజార్టీ ఎంపీ సీట్లు అందిస్తే దేశం మరింత అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. ఈ ర్యాలీ కూకట్‌పల్లి, వివేకానందనగర్ డివిజన్ల మీదుగా చందానగర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, రఘునాథ్‌యాదవ్, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కూన సత్యంగౌడ్, బాషిపాక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



వివేకానందనగర్ డివిజన్‌లో ర్యాలీలో కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, నాయకులు జగదీశ్వర్‌గౌడ్, రఘునాథ్‌యాదవ్

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో రోడ్‌షో

హైదర్‌నగర్: గడ్డం రంజిత్‌రెడ్డి, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ ఆదివారం ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో రోడ్‌షో నిర్వహించారు. కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ బైక్‌ర్యాలీతో వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌కు ఓటు వేసి తనను ఆశీర్వదించాలని రంజిత్‌రెడ్డి కోరారు. అనిల్‌రెడ్డి, రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

చందానగర్: చందానగర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉరిటి వెంకట్రావ్ తన అనుచరులతో కలిసి ఆదివారం రంజిత్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్, జైపాల్, రఘునాథ్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీలో చేరిన వారిలో సుధాకర్, పూర్ణచందర్‌రావు, నరేష్, మురళీ, రాజ్‌కుమార్, కాశీ, మహేష్, శ్రీకాంత్, మణితో పాటు పలువురు ఉన్నారు.

సీఎం ఆలోచించకుండా హామీలిచ్చారు: ఈటల

జీడిమెట్ల, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలేకుండా ప్రజలకు హామీలు ఇచ్చారని మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ సుచిత్రలోని అంబర్‌పేట కౌంటీలోని నాయకులతో ఆత్మీయ సమ్మేళనంలో ఈటల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ కోసం ప్రధానమంత్రి నరేంద్రమోదీ అయోధ్య రామమందిరాన్ని నిర్మించారని తెలిపారు. ప్రతిపక్షాలు మోదీ పేరు చెప్పుకొని ప్రజలను ఓట్లు అడుగుతున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనకు ప్రస్తుతం మోదీ పాలకు పొంతనలేదని, వారి కాలంలో రైల్వేస్టేషన్‌లు అభివృద్ధి జరుగలేదని తెలిపారు. మల్కాజిగిరి అభివృద్ధి ఒక్క బీజేపీతోనే సాధ్యమని, దేశం ప్రశాతంగా ఉండాలంటే మళ్లీ మోదీయే ప్రధాని అవ్వాలని పిలుపునిచ్చారు.



ఆత్మీయ సమ్మేళనంలో ఈటల రాజేందర్

తెలిపారు. కార్యక్రమంలో నార్లపురం శ్రీనివాస్, సుదర్శన్ ముదిరాజ్, దామోదర్ నేత, సాయిచంద్, శ్రావణ్, మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

అల్లాపూర్‌లో ఈటల కోడలి ప్రచారం

కేపీహెచ్‌బి కాలనీ: ఈటల రాజేందర్‌ను అత్యధిక మెజార్టీతో ఎంపీగా గెలిపించాలని ఆయన కోడలు క్షమిత ఆదివారం ప్రచారం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నాయకులు పులిగోల్ల శ్రీనివాస్, శ్రీలక్ష్మి ఆమెకు స్వాగతం పలుకగా, అల్లాపూర్ డివిజన్ శివాజీనగర్‌లో క్షమిత ఇంటింటికీ తిరుగుతూ కేంద్రంలో మరోసారి బీజేపీనే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని

బీజేపీ రోడ్ షోను విజయవంతం చేయాలి

కూకట్‌పల్లి: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈనెల 22న కూకట్‌పల్లి నియోజకవర్గంలో నిర్వహించనున్న బీజేపీ రోడ్ షోను విజయవంతం చేసేలా కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు కోరారు. యంజాల పద్మయ్య, శ్రీకర్‌రావు, కొడిచెర్ల మహేందర్, ప్రీతమ్‌రెడ్డి, వినోద్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్కింగ్ విషయంలో ఘర్షణ

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వాహనాల పార్కింగ్ విషయం లో ఘర్షణ జరిగి ఒకే కుటుంబానికి చెందిన వారంత ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సీహెచ్ ఓంకార్ అనేవ్యక్తి ప్రవేట్ ఉద్యోగం చేస్తూ యూసుఫ్‌గూడ చెక్‌పోస్టు సమీపంలో నివాసం ఉంటున్నాడు. శనివారం రాత్రి దస్తగిరి అతని కుటుంబ సభ్యులు వాహనాలు సరిగ్గా పార్క్ చేయకుండా అడ్డదిడ్డంగా పెట్టారు. ఈ విషయాన్ని ఓంకార్ మందలించగా దస్తగిరి కుటుంబ సభ్యు లు అసభ్య పదజాలంతో తిడుతూ గొడవ పడి ఓంకార్‌పై దౌర్జన్యానికి దిగారు. దస్తగిరి ఇంట్లోకి వెళ్లటానికి దారి లేకుండా వాహనాలు పెడితే సర్దుతున్నానని ఓంకార్ వచ్చి గొడవపడి దాడికి దిగాడని దస్తగిరి ఓంకార్‌పై ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఇరువర్గాల ఫిర్యాదులు తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మాదాపూర్ శిల్పారంలో నిర్వహించిన కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన భరతనాట్య కళాకారిని పార్వతీబాల కృష్ణన్ తన ప్రదర్శనలో భాగంగా తోడయా మంగళం, శ్రీ నగరలహరి, అన్నమాచార్య కీర్తన, జావళి, తిల్లాన అంశాలను ప్రదర్శించి మెప్పించారు. నగరానికి చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య గురువు క్రాంతి కిరణ్ శిష్యబృందం కూచిపూడి ప్రదర్శనలో భాగంగా వినాయకకౌతం, జతిస్వరం, మూషిక వాహన, రామ కోదండరామా, పుష్పాంజలి, జయలక్ష్మి, దశవతారాలు, జయజయ రామనాధ, థిల్లాన అంశాలపై చక్కటి ప్రదర్శనతో సందర్శకులను మంత్ర ముగ్దులను చేశారు.



కళాకారుల ప్రదర్శన

సామాజిక ఉద్యమకారుడు కందుకూరి

చిక్కడపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): సామాజిక ఉద్యమకారుడు కందుకూరి వీరేశలింగం అని పోలీస్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దామోదర్‌గుప్తా అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా దామోదర్‌గుప్తా మాట్లాడుతూ.. వితంతు వివాహాలు జరిపించి మహిళల విద్యకోసం వీరేశలింగం కృషి చేశారని అన్నారు. పత్రికా సంపాదకులుగా, రచయితగా సమాజంలో చైతన్యం కోసం జీవితం అంకితం చేసిన మహనీయుడు అని కొనియాడారు. సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, బీజేపీ నేత, సామాజిక కార్యకర్త నైషధం సత్యనారాయణమూర్తి, గానసభ పాలక మండలి సభ్యుడు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



కందుకూరి వీరేశలింగానికి నివాళులర్పిస్తున్న దామోదర్, జనార్ధనమూర్తి తదితరులు



లలిత గీతాలు ఆలపిస్తున్న గాయకులు

అలరించిన లలితగీతాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): మనసును హత్తుకునేవి లలితగీతాలని రాష్ట్ర ట్రెజరీస్, అకౌంట్స్ డిప్యూటీ డైరెక్టర్ జి. వసుంధర అన్నారు. నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ లలిత సంగీత గాయని ఏవీ సావిత్రి స్మారక లలితగీతాల పోటీల రజతోత్సవ వేడుకలు జరిగాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. లలితగీతాలకు ఆకాశవాణి ప్రాముఖ్యం ఇచ్చిందన్నారు. పాతిక సంవత్సరాలుగా నవ్యనాటక సమితి పోటీలు నిర్వహిస్తూ ఎందరో యువ కళాకారులను ప్రోత్సహిస్తోందని అభినందించారు. సంగీత కళాకారులు తాడేపల్లి లోకనాధశర్మ, ఆనందమోహన్ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. లలిత గీతాల రచయిత, గాయకుడు కృష్ణమోహన్, గాయని సురేఖ, శశికళాస్వామి, ఆచార్య ఫణీంద్ర, సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యం

యూసుఫ్‌గూడ: ఇంటి నుంచి వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రహ్మత్‌నగర్‌లో బి.రాజ్‌కుమార్, రేఖా దంపతులు ఏడేళ్లుగా నివాసం ఉంటున్నారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 9.30 గంటలకు రేఖ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండడంతో మధరానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మధురానగర్‌లో..

యూసుఫ్‌గూడ: ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఆర్.జగన్ సుభద్ర దంపతులు 13 ఏళ్లుగా యూసుఫ్‌గూడ సాయిబాబా దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్నారు. గత నెల 24వ తేదీ జగన్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సుభద్ర ఎంత వెతికినా ఫలితం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.



చందానగర్‌లో రోడ్‌షోలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్

చందానగర్‌లో విశ్వేశ్వర్‌రెడ్డి రోడ్‌షో

చందానగర్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): చందానగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్‌తో కలిసి చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రోడ్‌షో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అభివాదం చేస్తూ తనను ఆశీర్వదించి ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు.

యోగా చేస్తూ ప్రచారం

గచ్చిబౌలి: బొటానికల్ గార్డెన్‌లో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గసభ్యులు రవికుమార్‌యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆదివారం ఉదయం బొటానికల్ గార్డెన్‌లో వినూత్న రీతిలో యోగా చేస్తూ ప్రచారం చేశారు. వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ, చిన్నారులతో కరాటే చేస్తూ, ఆసనాలు వేస్తూ ముచ్చటించారు.



ఆసనాలు వేస్తూ ప్రచారం చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

నగర వాసులంతా బీజేపీ వెంటే

మియాపూర్: నగర ప్రజలంతా బీజేపీతోనే ఉన్నారని, మూడోసారి మోదీ ప్రధానమంత్రి ఖావడం ఖాయమని కొండా విశ్వేశ్వరరెడ్డి సతీమణి సంగీతారెడ్డి అన్నారు. ఆదివారం ఆమె పార్టీ నాయకులతో కలిసి మియాపూర్ రామ్‌నరేష్‌నగర్, మయూరినగర్ మీనాక్షి స్కైలాంచ్, ఆదిత్య సన్‌షైన్, అపర్ణ సరోవర్‌లో తన భర్త విశ్వేశ్వర్‌రెడ్డి తరుపున ప్రచారం చేశారు.



దేవేందర్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సునీతారెడ్డి

సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం

గాజులరామారం, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కానుకగా ఇద్దామని పార్టీ కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డితో కలిసి మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలియాదవ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, రఫీయా బేగం, కొలన్ రాజశేఖర్‌రెడ్డి, అరిజే జేమ్స్ శ్రావణ్, సంజీవరెడ్డి, లాయక్, శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ తన్వీర్‌ఖాన్ రిమాండ్

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌నగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 25 కేసుల్లో ప్రమేయమున్న మహ్మద్ మెహ్రాజ్ ఖాన్ అలియాస్ తన్ను అలియాస్ తన్వీర్‌ఖాన్‌ను మధురానగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డిగూడ ప్రాంతానికి చెందిన తన్వీర్ ఖాన్ గతంలో పలు కేసుల్లో జైలుకు కూడా వెళ్లివచ్చాడు. ఇతనిపై రౌడీషీట్ తెరచి జైలుకు పంపినా ఇతని తీరులో మార్పు రాలేదు. నగర కమిషనరేట్ పరిధిలో 25 కేసుల్లో ఇతని ప్రమేయం ఉంది. ఇటీవల మూడు కేసులు ఇతడిపై నమోదయ్యాయి. ఎల్లారెడ్డిగూడలో తన్నూఖాన్ అతని సహచరులు జాకీ, సలీమ్‌లతో కలిసి ఓ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లి కారిడార్‌లో నుంచి మా ఇంటిపై రాయి వేస్తావా అంటూ కర్ర, కత్తితో దాడి చేశారు. లాక్‌డైన్ సమయంలో తన్నూఖాన్ అతని సహచరులు తమ ప్రాంతానికి వచ్చిన నలుగురు అపరిచితులపై అకారణంగా దాడిచేసి కొట్టారు. బాధితులు బయపడి పోలీసులకు ఫిర్యాదు కూడా చేయలేదు. వారిని కొట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావటంతో మధురానగర్ పోలీసులు అతనిపై స్వయంప్రతిపత్తి కేసు నమోదు చేశారు. అంతే కాకుండా ఎల్లారెడ్డిగూడ ప్రాంతంలో నాలాను ఆక్రమించి ఇనుప షెడ్ వేసి దానిలో మేకలు, కోళ్లు తదితర జంతువులను పెంచాడు. పోకిరీలను పోగుచేసి క్యారమ్‌బోర్డులు ఆడిస్తూ చుట్టుపక్కల వారికి అసౌకర్యం కలిగేలా చేశారు. ఈ విషయంపై స్థానికులు సమాచారం మేరకు జీహెచ్ఎంసీ అధికారులు ఆ ప్రాంతాన్ని సందర్శించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన్నూఖాన్ ను పోలీసులు వెతుకుతున్నారని 20-1-2024 నుంచి పరారీలో ఉన్నాడు. సంగారెడ్డి, జహీరాబాద్, బీదర్, హుమ్నాబాద్, కర్నూల్, గుంటూరు, విజయవాడ, పూణే తదితర ప్రాంతాలకు మకాం మారుస్తూ తప్పించుకుంటున్నాడు. మధురానగర్ పోలీసులు నిఘా వేసి విశ్వసనీయ సమాచా రం మేరకు ఈ నెల 20న మాదాపూర్‌లో ఉన్నట్లు తెలుసుకుని వలపన్ని అరెస్టు చేసి నిందితుడ్ని 14వ ఏసీఎమ్ఎమ్ మెజిస్ట్రేట్‌కు హాజరు పరచటంతో కోర్టు నిందితుడికి మే 4వ తేదీ వరకు రిమాండ్ విధించింది.



తన్వీర్‌ఖాన్

ఇంటి ముందు పార్క్ చేసిన వాహనం మాయం

యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు పార్క్ చేసిన వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వెంగళరావునగర్ ప్రాంతానికి చెందిన బి.నారాయణ ఈ నెల 17న తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పార్క్ చేసి బయటకు వెళ్లాడు. మరుసటి రోజు వచ్చి చూడగా తన వాహనం కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వరల్డ్ రికార్డు కోసం కరాటే ప్రదర్శన 24న

బర్కత్‌పుర, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి): జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 24న వరల్డ్ రికార్డు కోసం కరాటే ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్. జీఎస్. గోపాల్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కరాటే ప్రదర్శనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. అకాడమీ కార్యాలయంలో బుధవారం ఉదయం 7 గంటలకు ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. 24 కిక్‌లతో 24 సెకన్లలో 24 నాపరాళ్లను బ్రేక్ చేసి వరల్డ్ రికార్డ్ స్థాపించనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 24 వరల్డ్ రికార్డు సంస్థలు కార్యక్రమంలో పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో మహావీర్ ఫొటో ఎంపోరియం అధినేత సమీర్, సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ దీరణ్ రాణా, కరాటే మాస్టార్లు నర్సింగ్‌రావు, శ్యామ్‌కుమార్, అమృతారెడ్డి, మహేందర్, జాకీర్, యోగిని, శైని, ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలి

నిజాంపేట్, ఏప్రిల్ 21(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలంటూ ఆ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లిలోని 1వ డివిజన్ కాంత్రినగర్ కాలనీల్లో ఆదివారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో కార్పొరేటర్లు కాసాని సుధాకర్, పైడి మాధవి, సుజాత, బాలాజీ నాయక్, మహిళా అధ్యక్షురాలు, అర్పిత, డివిజన్ అధ్యక్షుడు మధు, కృష్ణ మంజరి, సాంబశివారెడ్డి, సతీష్, వెంకటేష్, వెంకట్రావు, రవీందర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



1వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న రాగిడి లక్ష్మారెడ్డి, రంగరాయ ప్రసాద్

24న లక్ష్మారెడ్డి నామినేషన్

దుండిగల్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఈనెల 24న నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా ఆదివారం శంభీపూర్‌లోని ఎమ్మెల్సీ కార్యాలయంలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. 24న నామినేషన్ చేయనున్న సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతారని తెలిపారు.

మల్కాజిగిరిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలి:

కూకట్‌పల్లి: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ కె.నవీన్‌కుమార్ తెలిపారు. కూకట్‌పల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డితో పాటు ముఖ్యనాయకులతో సమావేశమయ్యారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం ముమ్మరం చేసేలా చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. ఈనెల 24న లక్ష్మారెడ్డి నామినేషన్‌కు భారీ ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే వివరించారు.

రైళ్లలో మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, ఏప్రిల్ 21 (ఆంధ్రజ్యోతి) : రైళ్లలో మద్యం రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దెబస్మతి బెనర్జీ హెచ్చరించారు. ఆదివారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. శనివారం సికింద్రాబాద్ స్టేషన్‌లో ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు తనిఖీలు చేపట్టి ఓ వ్యక్తి వద్ద రెండు బ్యాగుల్లో ఉన్న 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె తెలిపారు.